

# కొత్తపల్లి సూర్యారావు గారు

(వెనుకటిసంచిక తరువాయి)

## పదియవ యంకురము

మానాయన వ్రాసిన శుభలేఖ వీరికి—ఆగరపారాస్టేషనులో నుండఁగానే యందినది.

"సెలవు దొరకదు. కొన్నిసమయములలో సెలవు కడపట వేఱొకతావునకుమార్చుట సంభవించును. అయ్యో యిటువంటి మంచిస్టేషను విడిచిపెట్టవలసివచ్చునేమో" యను బెంగ. లక్ష్మీనారాయణనో, దీక్షితునో జతయిచ్చి యిచటికిఁ బంపివేయుమన్న మర్యాదగాదు. శాంతులు లేవు, దోషములు లేవు; మంచినక్షత్రము. కాని యాచారవిరుద్ధముగాఁ బంపివేయుటకింకను మావాండ్రకు లౌక్యము, నవనాగరకత ముదుర లేదు. నలుగురు నవ్వుదురు—మూఁడు దినములకైనను రానుపోను మఱియాఱుదినములు సెలవు కావలయును. అథమపక్షము పదునైదుదినములు సెలవు పెట్టవలయును. ఆయాఱుసెలలో నెవ్వరినో వీరిస్థానమునఁ బెట్టెదరు. సెలవుపుచ్చుకొన్నవారి స్థానములోఁ బనిచేయుటకుఁ గొందఱుమేస్టరు లున్నారు. కానివిడిచిపెట్టి వచ్చుటకు మనస్కరింపలేదు. మానాన్నపేర మీరందఱు నిక్కడికి వచ్చిపోరాదా యని వ్రాయఁబోయిరఁట. ఒక్కతె—కూతురు! వారు పూర్వాచారపరులు; ఉద్యోగులుచేయు టెక్కులు చూచినారాయని యెవ్వరితోనైన నందురేమో యనభయము. చిట్టచివరకు ముహూర్తము నాఁటికి సెలవుపెట్టి వచ్చుటకే నిశ్చయించుకొన్నారు. రామముగారికి, బంగాళీబాబులకుఁ దెలియఁబఱచినారు. దొరకినది సెలవు. ప్రయాణమై మూఁడునాళ్లకు రైలుమీఁద, బండిమీఁదఁ, బడవలమీఁద నిల్లు చేరిరి.

శోభనదినములు గడచినవి. మరల మరలవచ్చుటకు దగ్గఱ దాపుగాదు. నాతోడనే ప్రయాణము చేయుడని యత్నము. తొలిసారే, కంచమని ముంతయని మావారు త్రొక్కులాడుచున్నారు. "మేమన్నియు నక్కడనే కొందుము; రైలులో మూట లెత్తిదించి కష్టపడలేము? మాకు మార్గపత్రము లున్నవి—మూఁడునాళ్లప్రయాణము—ఎక్కుటదిగుట—మీరేమియుఁదొందరపడవల"దని—"ఆదారిని కాశీయాత్ర చేసివత్తురుగాని రం"డని మా తలిదండ్రులను వారి తలిదండ్రులనుగూడఁ బ్రయాణము చేసిరి. ఆదరబాదర నందఱుఁ బ్రయాణమగుచుండిరి. బండ్లువచ్చినవి—సామాను లేదుగాని—ఏదో కొంచెమైన నుండదా – ఎక్కించుచున్నారు; ఎక్కుటకు సిద్ధముగా నున్నారు, ఉత్తరముల బంట్రౌతొక్కఁడు హిందీలో వ్రాసినయుత్తరమొక్కటి తెచ్చి మావారికిచ్చినాఁడు—బండ్లు నిలిపి, యుత్తరము చదువుకొని—మనస్సుచివుక్కురని—నేలఁ బెట్టికొట్టిరి. నలువురు నొకరిమొగమొకరు చూచుకొనసాగిరి. "మామగారు! మీరిపుడు రావలదు. మే మక్కడకు వెళ్లి వ్రాసెదము. మీరప్పుడు రావచ్చును." "నాన్నగారు! తక్కినవి నన్నిపు డడుగవలదు." అని నేలఁబడవైచిన యుత్తరముతీసి పుచ్చుకొని—

మాతలిదండ్రుల ప్రయాణమునిల్పివైచిరి. మే మిరువురమే బైలుదేఱితిమి. అందఱును బిక్కమొగము వైచికొని మావంకఁ జూచుచుండిరి. మాబండి కదలినది. దూరభారములు, క్రొత్తకాఁపురము, కుఱ్ఱవాండ్రు-ఎట్లుందురో యేమో యనుకొనుచుఁ గ్రమక్రమముగ నందఱును మరలిరి.

పదునేనుదినముల సెలవులోఁ బనిచేయుటకు నియమింపఁబడిన "మురళీధర్" అను మేష్టరు వ్రాయించినయాకాశపురామన్నయుత్తర మది. ఆగరపారాష్టేషనులోనివారెల్ల-మా మీఁద నేరములుచెప్పి గోలయెత్తిన ట్లున్నది. దానిలో - ఆయనయూహ-యేమనఁగాఁ దా నెట్లయిన నా స్టేషనులోఁ బెద్ద మేష్టరుగా నుండి ధన మార్జింపవలయునని, దానికై యిట్టివెఱ్ఱివ్రాఁత వ్రాయించినాఁడు. మాపై నొక్కరికిని క్రోధములేదు. వైరు లెవ్వరునులేరు. తాను వ్రాసినదానిలోని వన్నియుఁ గల్పనలు. మాయిల్లు మేము వచ్చువఱకు జాగ్రత్తగాఁ జూడుమని-మురళీధరుగారి కొక్కింతభాగ ముండుట కిచ్చి - తక్కినదానిని పోర్టరు గోపీకున్నద్దె లేక గోపీనాథున కొప్పఁజెప్పి వచ్చిరి. ఈయుత్తర మంతయు వాఁడు వ్రాసినట్లు జనుల కర్థమిచ్చులాగున వ్రాయించినారు. పాపము, వాఁడుమా పాదదాసుఁడు. అతివిధేయతతోఁ గాలితోఁ బనిఁ జెప్పిన జేయుచున్నవాఁడు. కార్యము సాధించుకొనుటకు మార్గము లనేకము లున్నవి. మంచిదారినిసాధించుకొనుట చేతఁగాక కల్పించిన తప్పుత్రోవ లివి. ఆకాశరామన్నయుత్తరము లెప్పుడు దాగినవి. ఏవియును నెన్నఁటికైన సత్యమును బైటఁబెట్టకమానవు. గోపీనాథు నడుగకుండఁగనే, రెండుసారులు రైలులోఁ జదివికొనిన సమస్తమును బూసగ్రుచ్చినట్లు-మాకాయుత్తరము చెప్పివైచినది. ఉత్తరములోని విషయములు మొత్తమునఁ జెప్పినఁ గొందఱకుఁదృప్తి యగును. కొందఱకున్నదియున్నట్లు చదివివినిపించినఁ గాని తృప్తియుండదు. ఒకప్పుడు చదువువారి ధారాళశైలిలో, నర్థముచెప్పుటలోసంక్షేపతచేఁ గొన్ని ముఖ్యాంశములు వినువారికిఁ గావలసినవి,చదువువారికిఁ దెలియనివిడిచిపెట్టఁబడును. కావున'నథ' మొద'లితి'వఱకుఁ జదువుట యొక్కరియభిప్రాయము. చక్షురక్షుర సంయోగముగానిదే కొందఱకుఁ బరులు వినిపించినఁ దృప్తికాదు. వారే చదువుకొనకున్నఁ బరితృప్తి కలుగదు. అంతయుఁ జెప్పుట యుత్తమపద్ధతియే కాని నాకప్పటికి హిందీ బొత్తిగాఁ దెలియదు. నేను జదువలేను-వారు చెప్పిన మాటలనుబట్టి గ్రహించితిని-మాకుఁ గావలసిన విషయమేదో మాచే గ్రహింపఁబడినది. దానివలన మీకు నేను సంక్షేపవృత్తాంతము నే చెప్పఁగలను.

ఉత్తరము:"నీవు దౌర్భాగ్యుఁడవు. నీవు తినలేవు. పరులను దిననీయవు. వర్షములు కురియుచున్నపుడు చెఱువులు గుంటలు నీరుకట్టి నిండించికొందురు. ఎక్కువయగు దానిని బరభూములకు విడిచిపెట్టెదరు. నీ కేమియుఁ దెలియదు. నీవు మానుకొందువుగాని నీక్రిందివారి నోరు కట్టివేయుటకు నీ కేమి యధికారము. మా వంటి పేద వాండ్రము, బిడ్డలు పాపలు గలవాండ్రము, లెక్క-రూపాయలతో నెట్లు కాలము గడుపుకొందుము. నీ వొంటిగాఁడవు గావున నీ ముప్పు గడచి పోవుచున్న[illegible] రానీ నీసంసారము-నీవు పడుపాట్లు నే నీకన్నులతోనే చూచెదను. ఇట్టి యగ్నిహోత్రమువంటి నీనోటితో నేనే కక్కుఱితిమాట లనిపించి యీ నాచేతులతోనే నీయింటి కన్యాయవిత్తము తెచ్చిపెట్టి తినిపించెదను చూడుము. సిరి వచ్చునపుడు మోఁకాలొడ్డినట్లు - మహారాజులు-వారికినిత్యము వేలకొలఁది వచ్చుచుండును. మనకు వారు నెల కింతబిచ్చముపెట్టెదమనిన నేల తృణీకరించెదవు. దేవుఁడుగదా దేవేంద్రనాథసేనుగారు! మన మీ యూరువదలి దిక్కుమ్రొక్కులేని యేయడవిలోఁబడియెదమో-దొరకిననాఁడు పోఁగొట్టుకొనిన లేనినాఁడు రమ్మనిన నెక్కడనుండి వచ్చును? ఈదినములలో న్యాయము పనికిరాదు. న్యాయమునకు నన్యాయమునకు నిందేమున్నది. సంతోషపూర్వకముగా నొక రిచ్చుదానిని జేయి చాఁచి పుచ్చుకొనుట కేమిబరువు;ఏమి యన్యాయకార్యమిది! ఇతరస్థలములలోవలె నిక్కడను,ధాన్యములు, పండ్లు; ఫలములు రావు.ఇతరవస్తువులయొగుమతి లేదు;దిగుమతి లేదు. వీరు పెట్టునదేమనకుభిక్షము. నిస్పృహుఁడవే యైనయెడల నీ వింటిపట్టున నేయుండి కలియో గంజియో త్రావుచుండ రాదా! మా ప్రాణమునకు నీవు పానకములోని పుడుకవలె-నున్నాఁడవు. సరి, యైనదిలే, యిపుడు వచ్చిన క్రొత్త బాబూ మంచివాఁడు. నిన్ను మఱియొకచోటికి మార్పించులాగున మాటలాడి మాకు సంతోషము చెప్పి యానంద

పెట్టువానివలెనే కనఁబడుచున్నాఁడు. మే మెన్నఁటికి బీదకూలివాండ్రమే. మీకువలెఁ బెద్దజీతములు మాకు రావు. మానోరు కట్టి మాగొంతుకుడి నొక్కుట నీకు జయకరముగాదు. ఏదో తొందరగా బదులు వ్రాయవలసిన కాగితమునకు నీవు బదులు వ్రాయకుండ మూలఁబడవైచి- వచ్చినవారితోఁ జెప్పక- మరియుచుఁ బరువెత్తినావఁట. అది యిపుడు మేకైనది. క్రొత్తబాబు- వెదకి సమాధానము వ్రాసి పంపినాఁడఁట—ప్రాఁతమేష్టరు సోమరి యని- పెద్దకచ్చేరిలో- నీకుఁ బేరు వచ్చినదఁట. నీకెవ్వరయిన స్నేహితు లున్నయెడల 'నాకీ అగరపారాసేషను వలదు. నా సెలవు కడపట మఱియొకతావునకు నన్ను మార్చివేయుఁ'డని వ్రాసికొంటివా మాటదక్కును, గాని, యిక్కడకు వచ్చితివా నిన్ను నలువురు నాల్గు తెన్నుల దూయఁబట్టుకొందురు. నీ కిక్కడ నేమున్నది? నీగదిలోనిపఱుపు మంచము-అద్దె- నాఁడే నా చేతఁ బంపివైచితివి. ఏవో రెండుబొళ్ల లున్నవి. నీవు పెద్దపెద్ద సావాసము గలవాఁడవు, నీయొద్ద నేదో గోపన్న పెట్టియున్నదని మొన్నటిరాత్రి నేను వర్షములో-నెదుటిబండి కప్లింగు- షంటింగు-లైనుక్లియరులలోఁ దొందరలో నుండి చీకటిచేత బద్దకించి యింటియొద్దఁ బండుకొంటిని. ఎవ్వరో తలుపు తెఱచియుంచిరి. ఏమి పోయిననో యేమి తీసికొన్నారో? నీ విక్కడికి వచ్చితివా యేమిప్రయోజనము? అమ్మనుగూడఁ దీసికొనివచ్చితివా చీపురుకట్ట మొదలుకొని పునఃప్రయత్నము చేయవలసినదే- ఇంతే యిక్కడి సంగతులు—"

ఇట్టి యా కాశీరామన్న యుత్తరములు పల్లెటూళ్లలోఁ గరణములు, నిరుద్యోగులగువారిపుత్రులు, గడేకారీలు తప్పుసాక్ష్యములిచ్చి జీవించువారు, తిమ్మిని బమ్మినిజేయు మహానుభావులు, తఱుచుగ వ్రాయుచుందురు. అప్పుసప్పు లడిగిన నీయకున్న-వారికి వృత్తిపన్ను గట్టుఁడని-మిక్కిలి ధనవంతునిఁగూడ, గుడ్డివారివలె గ్రామోద్యోగులు వారికి లొంగి నిజమును సరకారునకుఁ దెలుపకున్నారనియు- వ్రాయుచుందురు. పతివ్రతయగు నొక్కమగనాల్లు తన పేర వ్రాసినట్లు దొంగలేఖలు కల్పించి చూపువారు కొందఱు. నీవు నా కీయవలసిన సొమ్ము పదినాళ్లలో నీయకున్నఁ దగవుపెట్టెదనని— మీకు నే నీయవలసినది లేదనిన, నీవుగాదు నీచచ్చినమగఁడీయవలసినది గలదు- చూడుమిదిగో నాతఁడు వ్రాసియిచ్చిన కాగితమని కృత్రిమపత్రములు సృష్టించి యలఁతఁబెట్టువారు కొందఱు-కుగ్రామములలోని లక్షణము లివి. చదువఁగాఁ జదువఁగా నీయుత్తరము మర్దక్గాఁడు వ్రాసినది కాదు. మూన్నాళ్ల ముచ్చటలోఁ గన్నుకుట్టి మురళీధరుఁడు కల్పించినదే-వీఁడే నాలుగుమారులు ముట్టించియుండును. హనుమంతుఁడు లంకంతయుఁ గాల్చి విభీషణుని యిల్లొకటిమాత్రము కాలకుండఁ జూచినాఁ డందురు. అప్పుడేమో కాని యిప్పుడు నమ్మలేము. కోపమున నొకరియింటి కగ్గి వెట్టినఁ దనయిల్లు గాచికోఁ దరమగునా? ఇట్టి కృత్రిమము చేసినమురళీధరుఁడు తనమీఁదికేమియు రాకుండఁ దప్పించుకొనఁగలఁడా! ఇది వట్టికల్పనము. దీనికై మనము భయపడనక్కఱలేదు. వడ్లగింజలో బియ్యపుగింజ—యని, యడుగుపెట్టుచుండఁగానే పిడుగుపడినదా యని క్రొత్తకాఁపురమునకు వచ్చుదారిలోనె యీయపశకునమా యని చింతించు నన్ను-రైలులోఁ బలుమాఱో దార్చి "చూడుము, మన మక్కడికి వెళ్లునప్పటికేమియునుండదు. ఈయుత్తరముసంగతియే యొక్కరు నెఱిఁగియుండరు. మనలోనేమైనలోపమున్నపుడుగదా మనకు భయము. నీవు దొంగసొమ్ముపుచ్చుకొనలేదు, లంచముపట్టలేదనియే కదా మనపై నాతఁడు మోపిననేరము. తొందరకాగితము త్రొక్కిపెట్టి వచ్చినాననికదా యొక్కతప్పు-దానికి నేనేమిచేసివచ్చితినో వాని కేమి తెలియును. నామనస్సులో నాకుఁ దొట్రుపాటు లేదు. నిరాలోచనముగ నున్నది. మనకేమియు ననుమానపడి పెనుభూతములచేఁ బట్టువడవలసినది కనఁబడదు. న్యాయమార్గ మొకప్పు డితరులకన్యాయమార్గముగాఁ గనఁబడినను నిజప్రకృతి వెల్లడియగునుగాని యూరకపోదు. మన యిద్దఱుబంగాళీబాబులు చిరంజీవులై యున్నంతకాలము, మనరామునుగా తిందున్నంతకాలము, సి. కె. సేక్కంపెనీవారి స్నేహమున్నంతకాలము నన్నొకరేమియు వ్రేలెత్తిచూపలేరు. తర్వాత నాకేమైన దుర్బుద్ధిపుట్టవలయునేమో చెప్పలేను. 'వెంకమ్మ తొలిసారి వెళ్లిననాఁడే యూరంతకాలిన'దని 'సీతమ్మ యడుగుపెట్టిననాఁడె దొంగలుపడి'రని-యున్న జరగినవానిం దలంచుకొని నీవుభయపడవలదు. నడుము నీ

నెవ్వరు ; అతఁడున్నాఁడు, నేనున్నాఁడను. ఏమిటి; అబ్బే! వానితో నీప్రస్తావనయే లేను. ఛీఛీ! వాఁడే నన్ను జూచి బెదరుచూపులుచూచునుగాని నేనేమియు నెఱుఁగనివానివలె నటింతును. మఱియేమి? కాకపోయిన-నేనె వ్వరితోను జెప్పను-అబ్బే! గోపీకుచమర్దనుగాఁడు-వానిని గూడనడుగను - కాదామఱి, ఏమైననున్నచో వాఁడే చెప్పును. మనగదిలో నెవ్వరోచొచ్చి తలుపుతెఱచిపో యినారన్నదికూడవట్టిదే. బాగుగాఁ జెప్పినదానవు. ఇంత మాత్రమునకే భయపడి యక్కడకురాకుండఁ బోవుదమ నుకొన్నాఁడు - అజ్ఞానమనఁగానేమి? ఇదియే,-తానే బుద్ధిశాలి, యితరులు బుద్ధిలేనివారని యెవరిమట్టుకు వారు తలంపకున్నఁ బ్రపంచయాత్ర జరుగుటయెట్టు? ఇఁకనేమి, నీకును దెలిసినది,నామనస్సులోనిదియేయూహ. నన్నిక్క డనుండిలేనసెత్తి తానుండినోల్లుకొని తినవలయునని యూహ వానికున్నది. మన మేల వలదనవలయును. తిననిమ్ము. తనపాట్లు తానుబడుట మంచిది, గాని నడుమ నామీఁదఁ గంటకమెందుకు.— ఇంకను జిత్రములు మనమక్కడకు వెళ్లినతర్వాత బైలుదేఱును జూడుము. ఇంకను దొరల తో నేమేమోకుత్రలు పన్ని చెప్పియుండును జూడుము. సత్యమని యసత్యమని చూడనివారి కేమి తెలియును. పై యధికారియెవ్వఁడో నన్నుఁ బరీక్షించుటకు వచ్చును చూడుము—మనమక్కడికివెళ్లినతర్వాతఁగాని తెలియదు."

ఇట్లు రైలులో మేమిరువురము సంభాషించుకొ నుచు నిర్భయులమై ప్రయాణము చేసితిమి. రైలుదిగి నాము. చిన్నమేష్టరుగారువచ్చి చేయిపట్టుకొని నవ్వి నారు.పోర్టరులు-అందఱికంటె ముందుగోపినాథుఁడువచ్చి మ్రొక్కినాఁడు. నన్నుగాంచి 'హా! మాయీ!' యని నాయొద్ద వినయము చూపినాఁడు, సామానుదింపినారు. గార్డువచ్చి కుశలప్రశ్న చేసి సలాముపెట్టి - ఇంగ్లీషులో- "మాకు కాఫీలు, విందులు లేదా - మాకేమి తెచ్చిపెట్టి నావు." అని, కదలుచున్న బండియెక్కి వెళ్లినాఁడు. మేము మాబసలోనికి వెళ్లితిమి. మొదటిసాక్ష్యము-ఇల్లు శుభ్రముగా నుదయముననే గోపీనాథుని భార్య తుడిచి నీళ్లుచల్లి ముగ్గులు పెట్టినది. మేలిముసుఁగు సవరించు కొనుచు మేము గృహప్రవేశము చేయునపుడు-మావారికిఁ జాటుగఁ దలుపుదగ్గఱ నిలువఁబడి నన్నుఁగాంచి ముసిముసి నవ్వుతో - మగనివైపునకుఁదిరిగి, సంజ్ఞగా 'బాల్యము, కాని, యీయనకుఁ దగినదే. ముఖము, కన్నులు - అందముగానున్న' దని చెప్పుచున్నది. చిన్న మేష్టరుగారు "వేఁడినీళ్లు కాపించినాను, పాలున్నవి. టీగాని, కాఫీగాని చేయించెదను. కొంచెము విశ్రమించి స్నానముచేసి లఘుహారము కానిచ్చి సావకాశముగా వంటచేసికొందురుగాని ర"మ్మని తమబసలోనికిఁ దీసికొని వెళ్లినారు.వారును బ్రాహ్మణులేకాని-వారియింట భుజి యించుటకు మేము సంశయించునట్లు లేదు; గాని, వారే పిలువలేదు. హిందుస్థాని బ్రాహ్మణులు; అనేకభేదము లుండవచ్చును. నేను స్త్రీలున్నచోటికిఁబోయి నిలిచితిని గాని, గోల-రాతిగోడ్డ-వారిమాట నాకుఁ దెలియదు; నామాట వారికిఁ దెలియదు. కొంతసేపు నన్ను వారు చూచి చిఱునవ్వులు-నారూపుచూచి నావస్తువులుచూచి, నాబొట్టు, నాబట్ట కట్టుచూచి వింతపడిరి. సంజ్ఞల చేతనే నాకు స్నానమునకు నీళ్లిచ్చిరి. కాఫీ వలదంటిని; పంచదారకలిపి పాలిచ్చిరి. రెండరఁటిపండ్లు కొంత బా దము పప్పు-యేవో యింకఁ గొన్ని ఫలముల ముక్కలు పెట్టిరి. భుజించితిమి, తాంబూలమునిచ్చిరి; వేసికొంటిమి. కొంతసేపు మేమందఱ మిష్టగోష్ఠి నడపితిమి. ఎక్కడను మాయుత్తరము గొడవయే యెఱుఁగరు. ఆప్రస్తావనయే లేదు.

మురళీధరుఁడుగారు 'నిన్న సాయంకాలమే తల నొప్పి జ్వరము వచ్చినది. నేను రైలాసుపత్రికిఁ బోవు చున్నా'నని వ్రాసిపెట్టి చిన్నమేష్టరుగారికంతయునొప్పఁ జెప్పి కలకత్తా దయచేసినారఁట-ఇది రెండవసాక్ష్యము. మొదటిసాక్ష్యము మాయింట దొంగలు పడలేదని-రెండ వది మొగముచెల్లక మారాకకుమునుండే జ్వరము మిషపై మురళీధరుఁడుగారు తప్పుకొన్నారని తేలినది.

సాయంకాలమునకుఁ గ్రమక్రమముగా నిల్లు సా మానులు, సవరించుకొని వంటచేసికొని భుజించితిమి. రెం డుమూఁడు నాళ్లు నాకుఁ గ్రొత్తగానేయున్నది. ఆదేశము, స్త్రీలు, పురుషులు, వేషభాషలు, క్రొత్తగాదా ! నేను వారికిఁ గ్రొత్తగానుంటిని,రామముగారియొద్దనుండి యొక టి,జాబులువ్రాసినదొకటి, రెండుత్తరములు వచ్చినవి.అందు సమస్తవిషయమును బూసగ్రుచ్చినట్లు తేటపడినది.తాను

వృద్ధకాయుఁడుగానియట్లును భార్య గర్భిణియైనట్లును- ఇక్కడనాల్గునాళ్లు-అక్కడనాల్గునాళ్లు తిరుగుచుండుట కష్టముగా నున్నదనియు నెక్కడనైన నొక్క స్టేషనులోఁ గదలకుండ నుండునట్లు పడవేయుఁడనియు-నాకీ యాగర పారా స్టేషనే కావలయునని చెప్పకుండఁగా-నున్న స్టేషనులోనే యుండుమందురను ధైర్యముతో- నధికారులకు వ్రాసికొన్నాఁడఁట. దానిపై మురళీధరుఁ డిపు డెక్కడఁ బనిచూచుచున్నాఁడు; ఎవ్వరిస్థానమునందు; ఆమొదటి వాఁడెక్కడికేగెను, అనివిచారణకుఁ గచ్చేరిలోఁ బ్రారంభమైనదఁట-మురళీధరుఁడే స్వయముగఁబోయి-అగరపారా స్టేషనులోఁ బ్రస్తుతము తానున్నట్లును-విదేశస్థుఁడగు మెష్టరుండుట స్టేషనులోన సౌకర్యముగానున్నట్టు తానున్న పదునాల్గుదినములలో వినవచ్చెననియు- చిన్నరైలుస్టేషనుగనుక - గర్భిణియైనభార్యకు వృద్ధకాయుఁడు గానితనకు నారోగ్యమున కనుకూలముగా నుండుననియుఁ జెప్పుకొన్నాఁడఁట-ఇది మూఁడవసాక్ష్యము- ఎట్లుచెప్పిననట్లు వెంటనే చేయుదురా? ప్రభువు లాలోచించినారు. అగరపారాలోనున్న చిన్న మేష్టరుగారికి న్యాయమునకుఁ బెద్దపని రావలసి యున్నదఁట___కాని- మురళీధరుఁడు కొద్దిజీతగాఁడు. క్రొత్తగా రైలుపనిలోఁ బ్రవేశించిన వాఁడు - ఆక్టింగులేకాని ఖాయపు పని వాని కీయరఁట. ఇచ్చిన యెడ నిదివఱకుఁ గ్రిందఁ బనిచేయుచున్న వారికే యీవలయునఁట. ఇంతకు మును పటి మేష్టరునొద్దఁ దప్పిదము కనఁబడనిదే సెలవులో నున్నంతనే యడుగకుండఁ నెట్లు మార్చివేయవచ్చును. కూడదఁట-ఏమియుఁ బూర్వాపరము లాలోచింపకుండ మురళీధరుఁడు సిద్ధపడియెను. అందునను, విదేశస్థుఁ డుండుటచేఁ బ్రజల కసౌకర్యమేర్పడు చున్నదఁట-యనుమాటలో నసూయ కనఁబడుచున్నందున-నిది యెంతవఱకు నిజమో కనుఁగొనుటకుఁగా నొక్కరిని నియమించిరి. రైలులో నెందఱో యధికారులు - ఏదో యొకపనికై వచ్చుచునే యుందురు. ఆయనవచ్చి దేవేంద్రనాథసేనుగారితో-

"తెనుఁగు మేష్టరుగారు - మీకుఁ దృప్తికరముగాఁ బనిచేయుచున్నారా" యని యడిగిరి.

"అందుకు సందేహమేమి? ఈనడుమ నెవ్వఁడో క్రొత్తగావచ్చినవాఁడు కొంతచెట్టు సరివాఁడు" అని సేనుగారు-

"ఏమిచేసినాఁడు-కాని, విశేషములు మీరేమైన నెఱుఁగుదురా."

"విశేషములకేమిగాని - కలిసికట్టుతనము లేదు. తమస్టేషనుకు వచ్చిన వారెవ్వరెట్టివారో కొంచెము చూడవలెను."

"మీకేమైన నసౌకర్యముగా నున్నదా?"

"రామర్థామ-వచ్చెదము, పోయెదము-ఆయన తలఁచునట్లు రైలుకొఱకు వచ్చెదము; రైలెక్కి పోయెదము-ఆయనవలన మాకేమియు నసౌకర్యము లేదు. నేఁడుండి రేపుపోవు వాఁ డితఁడు-సెలవునుండి మాప్రాఁత మేష్టరు రానేవచ్చును___"

ఈ సంభాషణలోనే, కొంత యావిచారణాధికారి గ్రహించిన తర్వాత___ "ఇక్కడికొక్క క్రొత్త మేష్టరును వేసి సెలవులోనున్న వానిని వేఱొకచోటికి మార్చెదరు." అనిరి.

"ఏల, వానివలనఁ దప్పేమిగలదు? మార్చుటయనఁగా నింతకంటెఁ బెద్దస్టేషనుకు- ఇంతకంటెఁ బెద్దజీతమునకు మార్చెదరా-అట్లు లేకున్న వానినిందే యుంచుట న్యాయము."

"ఆసంగతి యింకను దేలలేదు-క్రొత్తగా వచ్చిన వాఁడు- వాని కింతలో జీతమెక్కువ యగుటకాని పెద్ద స్టేషనుకు మార్చుటకాని జరుగదు."

"అట్లయిన నాయన నిక్కడనుండి క్రొత్తవాఁడు గదా యని-యింతలోనే మార్చుట యన్యాయము."

"ఏదో తేలును. ఆలోచనమాత్రము జరుగుచున్నది. ముందు దెలియఁగలదు."

## పదునొకండవ యంకురము

విచారణాధికారివచ్చి మావారితో "ఏమయ్యా నీవు విదేశస్థుఁడవు. తిన్నగా జనులసౌకర్యములు కనుఁగొనుట లేదఁటయన్నారు." "చిత్రము! నాకునున దేవిచారము. నేనెక్కడికైన మార్పించుకొనవలెనని యున్నది. ఇక్కడికిఁ దగినవారి నెవ్వరినైన నియోగింపవచ్చును.

మేష్టరులు ప్రయాణికుల కష్టసుఖము లాలోచించు వారుగా నుండకున్న-న్యాయవిరుద్ధము గాదా!"

"ఈజీతముమీఁద నింకొకచోటికిఁ బోయెదవా."

"ఇంతకుఁ దక్కువజీతమైనను సరియే యొకరిచేతి క్రిందఁ బడవేయుఁడు-స్వాతంత్ర్యము వలదు."

అని యొకరిమాటల కొకరు నవ్వుకొనిరఁట-

మురళీధరుని వృత్తాంతమంతయు న్యాయాధికారి వలననే తెల్లమైనది.

'జ్వరములేనిదే నీవు హాస్పిటలుకు వచ్చితివి. నిన్ని చ్చటఁ జేర్చుకొన'మని; 'ఈతనికేమియు జబ్బులే' దని, డాక్టరుగారు, 'సెలవులే'దని వ్రాసివైచిరి. ఇది న్యాల్గవ సాక్ష్యము- దుస్తంత్రములు - న్యాయోపక్రమములవలె బలముగా నుండవు. తంత్రములవలన హానికలదు. లాభ మొకప్పుడుండదు. అట్టితంత్రము చేయువాఁడెప్పుడో యొకప్పు డెలుక బోనులోఁ బడినట్లు పడి చిక్కులు పడు ను. తనకై తాను బిలముతోఁడికొనినట్లగును. చక్కఁగా ఋజుమార్గమునఁ బోవుచున్న బుద్ధిని రెండవ వక్రమార్గ మునకు దింపిన నభ్యాసము చాలనికారణమున దాపటి యెద్దును వెలుపటికాడికిఁ గట్టినట్లు, గుంటచిక్కులుపెట్టి బండి పడఁద్రోసినవఱకు దానికిఁ దోఁపదు. తేలుకుట్టు నేమో యని దానితోఁకలోని వంకరగుణము చూచి జనులు పట్టికొట్టునట్లే వంకరపోకల వానిఁగన్న నెవ్వరి నేమిచేయఁదలచునో యని ముఁదే నలువురు న్యాల్గుఱాళ్లు విసరుదురు. ఒక్కచోఁ దనకుతంత్రమువలన నొక్క దమ్మిడి లాభము కనఁబడియెనా రెండవచోట లాభా పేక్ష నాతఁడు యత్నింపకమానఁడు. కన్నులు మూసి కొని యొడుదుడుకులలోఁ బరువెత్తినవాఁడొక్కసారి తప్పించుకొనిపోవునేకాని యన్నిసారులును బడకుండఁ జాలఁడు. చెల్లనికాసు నిట్టెపట్టివైచెదరు. నాడెము తెలిసిపోయినతర్వాత నేడియును జెల్లుబడికి రాదు. పలుకుబడిలేని దెంతటిదైనను నిరాదరము నొందును. పదాఱణాలుగల రూపాయలోఁ గొంచెముద్రమోఁత తక్కు వయ్యెనా యెల్లవారు దానికేదో తగ్గును జూచెదరు.

మురళీధరుఁడొక్కపని చేయఁబోయి రెండు మూఁడు తప్పులు చేసినాఁడు. నిమ్మకు నీరుపోసినట్లున్న ఆగరపారా స్టేషనుమేష్టరుమీఁద దోష మారోపించుట యొకటి; తనకాపదవి కావలెనని కోరుట రెండు, లేని రోగము నారోపించుకొని వైద్యునియొద్దఁ దెల్లపోవుట మూఁడు, సెలవుదొరకకపోవుట నాలుగు, ఇన్నికారణము లచే మావారిని జూచుటకు సిగ్గుపడుచుండుట యైదు. మంచివాని కొక్కప్రమాదమువచ్చిన; "వెన్నఁడు నిట్టి వాఁడుకాఁడు, కాఁగలకర్మదోషమునవచ్చిన"దని త్రోసి పుత్తురు. ఆతఁడట్టి ప్రమాదము లికముందు రాకుండ జాగ్రత్తపడును. బుద్ధిపూర్వకముగాఁ దప్పులను జేయు వాఁడొక దానిమీఁద నొకటిగాఁ జేయనే తలపెట్టును. విచారణముగావించి పై యధికారులకు వృత్తాంతమును బాగుగా దెలిపిరి. "ఆమార్గములోని స్టేషనులోఁ బనిలేదు. మార్పులు జరుగవలసిన యవసరమిప్పుఁడు కనఁబడదు. నీకు స్టేషనుమేష్టరు పదవినిచ్చుట కిపుడుగాదు. నీకంటెఁ బ్రథమగణ్యు లొకరిద్దఱున్నారు. నీ కనారోగ్యముం గూర్చి వైద్యుని యంగీకారముం దెచ్చుకొని, నీసంసార వ్యవహారములకైన యెడల, జీతములేని పద్ధతిని రెండు మూఁడునెలలు సెలవుపెట్టుము. సెలవు చిట్టచివర నెక్కడనైన నవకాశమున్న జూచెద"మని-వానికిఁ దెలియఁబఱి చిరి. తలుపుసందున వెలఁగకాయవాటము వచ్చినది. దాయనస్థితి. రోగములేదని డాక్టరు సర్టిఫికెట్టియ్యఁడు; జీతము లేకుండ సెలవుపెట్టిన భూతాదివ్యవహారమునకుఁ జిక్కువచ్చును. పాప మాబ్రాహ్మణుఁడు దొంగను తేలు కుట్టి నట్లేమియు ననక యథాప్రకారము తనయుద్యోగము లోనేయుండెను - మేము మాపనిలోనున్నారము. ఈ రెండు మూఁడధ్యాయములమాటలు-కుదురుగాఁ గూర్చుం డక తెచ్చిపెట్టికొనినవేకాని సారమేమైన నిందుఁగలదా? అల్పమేధావుల యాలోచనములఫలిత మిట్లేయుండును.

మాతల్లిదండ్రులు, సత్తమామలు - బెంగపెట్టుకొ న్నారు-దరిద్రపుటుత్తరము ప్రయాణముగుచుండగా వచ్చి నదే-దాన మనవానికేమి హానివచ్చునోయని భయపడు చున్నారు. వారిభయముతీరునట్లు నాలుగైదునాళ్లు సర్దు కొన్నతరువాత నిద్దఱకు రెండుత్తరములు వ్రాసినాను. దురాత్మలిక్కడ నక్కడ ననకుండ నన్నితావులనుగలరు. అన్నిస్థలములలో నున్నారు; అన్నిజాతులలో నన్నిమత ములలో సమృద్ధిగానున్నారు. ఆ మహాత్ములు లేకున్నఁ

ప్రపంచమునకు నొక్కలోపమే. దురదగొండి చెట్టెందు నకొనరాదు. ఒకనికిఁదెలియక తాఁకినవానికి నసరయెత్తించుటకో-యెఱిఁగినట్లుపయోగించువాని ఘోరారోగ్యమునకో పనికివచ్చును. అట్లే దుష్టుఁడు ప్రమాదయుతును మోసముచేయుటకో, బుద్ధిమంతులు దూరముగాఁ దొలఁగి పోయిగానుండుటకో పనికివత్తురు. పట్టుకొందురా సణమెఱిఁగినవారు వానిని దురదగొండికాయను బట్టుకొన్నట్లే సమూలముదంచి నిస్సారముచేసి విడిచిపెట్టెదరు. అనియిట్లు, వారును, బుద్ధిశాలియగు మురళీధరుని ప్రజ్ఞక న్యాపదేశముగా మెచ్చుకొనిరి. మురళీధరుని విషయము మనమిఁకతలో విడిచిపెట్టలేదు. ప్రకరణాంతరమునఁ గొంతప్రశంసచేయుదము - చూచెదరుగాక! బుద్ధిమంతుల లక్షణము, నపూర్వవివేకుల లక్షణము నెట్లెట్లు పరిణమించునో!

మే మిక్కడఁ గాఁపురముపెట్టినాము. ఉప్పుతోఁ గొమ్మిదియూ సంగ్రహించుచున్నారము. రామము గారి యింటిభోజనము విడిచినతర్వాత భోజనమునకై యెంతకష్టపడిరో తెలియదు. చెప్పినదానిని వినుటకే నాకు జాలిపుట్టినది. పదేనుదినములక్రిందట విడిచిపెట్టిన వంటయిల్లుచూడగనే మగవాండ్రవంటయని నవ్వువచ్చినది. ఇనుపప్రొయ్యితీసి కడిగి యిల్లంతయు బాగుచేసితిని. ఎన్నఁడైన నాయిల్లు నీళ్ల మొగము పేఁడమొగము నెఱుఁగునా! పైకప్పు బూజుదులిపి యిల్లుతుడిచి పన్ను పేటిచినదానను. నేనుమాత్ర మింతవఱకొరిందాగాఁ బని చేసినదాననుగాని, కుడియెడమల భేదమున్నది. వంటయనిన నాఁడుదానిచేతివిద్య, ప్రొయ్యినిండఁగట్టెలు పెట్టి పాత్రముపెట్టఁగనే వంటయగునా? దానితోనే యాతఁడు పాకయాజియగునా! వంటలో నేర్పరియని యర్థమేనా! మగవారికి వంటపలుకదు. ఏదియైనను బిల్చినంతనే 'హా' యని బదులుచెప్పినదే వానిపని. ఎట్లు నిప్పురాఁజఁబెట్టవలెను, పుల్లలెన్ని పెట్టవలయును, ఎంతయెసరు, బియ్యమెన్ని-ఇదియునొక్క శాస్త్రమే. ఇదియాఁడువారికళ. న్యాయమున కాఋనశాస్త్రిగారి కుమారుఁడేకాని శాస్త్రి పదమున కర్హుఁడుగాలేదు. ఆయనయిల్లాలిని నేను శాస్త్రిని. ఈపదములో స్త్రీపులింగముల భేదములేదు. నే నభ్యసించిన పాకశాస్త్రమును బరీక్షించుటకై రసజ్ఞులైన బందుగులు కావలయును. పరీక్షించుట యెట్లందురా! మా యిద్దఱకు నింతయుడుకవైచికొందుము. పదినాళ్లకింత పప్పు, నింతయుప్పు, నిన్నిబియ్యమని యాషామాషీగా నెట్లు పడవైచినను బోవును. ఇద్దఱుముగ్గురు చుట్టములు వచ్చినపుడు-ఎంతుప్పు, పప్పెంత-యక్కడనిపుణత-చిన్న పాత్రములు, పెద్దవంట-అట్టిచో మాశాస్త్రప్రసంగము, వండి వార్చికుదుటఁబెట్టి యీవలకు వచ్చితిమా క్రొత్తగా విచ్చిచూచినవారికది నిన్ననో మొన్ననో వంటచేసినయిల్లు వలెఁ గనఁబడవలయును. కాని ప్రొయ్యివెనుక నింతచింత పండు, ప్రొయ్యిముం దిన్ని పొక్కుమెదుకులు, బూడిద-బాడిబందలతొడుగా నుండరాదు. ఇంటికెవ్వరైనఁ బెద్ద మనుష్యులు, సంపన్నులు వచ్చిమాటలాడుచున్నారనినపుడు వంటియింటిలో నెవ్వరును లేనియట్లే తోఁపవలయును. ఇప్పుడు మాయింటిలోవలె సావడిప్రక్కనే వంట యిల్లుండును. అన్నపూర్ణశాలదూరముగానుండదు. దూరముగానుండనీ, ప్రక్కలోనుండనీ, గరటిచప్పుడువినఁబడరాదు. ముంచినపుడెల్ల బిందెలోఁజెంబు కంగుమని మ్రోగవచ్చునా! నేర్పనఁగా-మఱచితిని, మగవారియెదుట నుండి సవరించుకొనుచు నీవలికావలికిఁ దలవారించి తిరుగవచ్చునా, అన్నియుముందే యింటిలోనమర్చికొని తర్వాతమడికట్టుకొనవలయును. నేర్పనఁగా-పులుసో, చేరో, కూరో, తాలింపుపెట్టునదెవ్వరికిని వినఁబడనీయరాదు. మిరెపకాయలుమాడ్చి యూరందఱు దగ్గితుమ్మి-'యేతల్లిరా! తలదిమ్మువదలించిన'దని స్తుతింపనా! పూర్వమొక్క-రాజుగారును మంత్రియు నేనుఁగెక్కి వెళ్లుచుండఁగా నెవ్వరియింటిలోనో పోగపువాసనకు రాజుగారికి నోరూరినదఁట. మంత్రి దానిలో నుప్పు చాలదన్నాఁడట-వంటయనిన నంతబట్టబయలు భాగవతముగానా! "వండినచొప్పునుం బోగపు వాసనయుం బోగపాలుచందముం, భాండసమృద్ధి సంపదయుఁ బానవిభూతియు సర్వమంగళం" బని యన్నపూర్ణాదేవి వంటవలెనుండవలదా? ఇట్టి నిపుణురాలికిగాని శాస్త్రిపద మెట్లువచ్చును?

'జాగాయెఱిఁగి బైకో'-అని చెప్పుదురు. శాస్త్రిగారి కుమారునియొద్ద నీపాకశాస్త్రిగారికి భసాపంకము వచ్చినది. దాఁపనేల? దేశభేద మున్నది. ఇక్కడ వంట చేతఁ బడలేదు. మా పుట్టినింటు-మాస్వదేశము వంటకు

నిక్కడివంటకు–ౘ్రాయ్యికట్టెలు మొదలు తలక్రిందులే–పొరుగింటికి వెళ్లి పిడుకతో ముత్తెమంత నిప్పుదెచ్చి, పిడుకయంచులుచిదిపి యూపొడివైచి రాఁజఁబెట్టి కొన్ని చిదుకులు తగిలించి ౘ్రాయ్యిలోవేసి యూఁదితిమా వంట మొదలుపెట్టిన తర్వాత, పూర్తియై, కట్టెలు దిగఁద్రోచి "యజ్ఞేనయజ్ఞ" మనునంతవఱకు– విసనకఱ్ఱమాట తల పెట్టకుండ–వచ్చుపుడకలని మగవారినిదలపోయకుండనుండ వలయును. ఝుల్లిసీమలోఁ దుమ్మచెట్లు కోనసీమలోఁ గొబ్బరిచెట్లవలె మాకుఁ గల్పవృక్షములు. ఒక్కపుడక తిగిలించి కృష్ణాయని పాత్రమెక్కించితిమా–నలపాక భీమ పాకములుగా నుండును. ఇక్కడ నట్లుకాదు. ౘ్రాయ్యి నామమాత్రమే–ఇనుపకుంపట్లు–రాక్షసిబొగ్గు. శాస్త్రము చదువుటకు మొదలు కావ్యశ్లోకములు–కావ్యశ్లోకములకు ముందు శబ్దమంజరి–తరువాత 'సరాజ్య'మే. ఇది తెనుఁగు దేశపద్ధతి. పంచకావ్యములలో – లఘుత్రయి, లేక గురుత్రయి చదువకుండ శాస్త్రములకు దిగరు. మనదేశములో నేవేని–కాళిదాసత్రయమని చదివినంతనే శాస్త్రియని పేరు పెట్టుకొనును. ఇక్కడ సంగతియెట్లా! ముందేదో కొంతశబ్దపరిచితి–తర్వాత శ్రీమద్రామాయణములో నొక యధ్యాయము, తర్వాత లఘుకౌముది–పిమ్మట శాస్త్ర పాఠము. ఇట్లే నామాటయున్నది. ౘ్రాయ్యి, దానిపరిచయమునను శబ్దసంస్కారము లేదు. పిడుకలుఁ బుడుకలు నను కావ్యపరిశ్రమ లేదు. కుంపటి కావ్యము, నేలబొగ్గులు శాస్త్రము. మొదటినాఁడే శాస్త్రిగారి కుమారునియొద్ద "జితోస్మి" యనవలసివచ్చినది. తాము వాడుకొనుబొగ్గుల పరిమాణము, విధానము కొంత నేర్పవలసివచ్చినది. ఒక్క శాస్త్రములోఁ బరిచయము కలవారికి రెండవశాస్త్రము–అందిపుచ్చుకొన్నట్లే యుండును. చాలనాళ్లనుండి స్వయంపాకముతో సోమయాజిగారివలె నున్న వీరికి–మనపచ్చడులు, మనపులుసులు, వేఁపుడులు రుచిచూపించి నానాటికి మెప్పుగొన మొదలిడితిని. లేవఁగానే, చక్కఁబడి, నీళ్లుపోసికొని, మడిబట్టలారవైచికొని, కూరనారలు చూచికొని, సడింపు బియ్యము కొలిచికొని, వారు దంతధావనముచేసి యొక్కమాఱు స్టేషనులోనికి వెళ్లివచ్చులోపున సిద్ధముచేసి యెదురుచూచుచుండుటయే– వంటయైనదా యని వారడుగుటగాని– అయిదునిమిషములు మీరు స్నానముచేసి సంధ్యావందనము చేసికొనునప్పటికిఁ బులుసు దింపెదననికాని–ఊఁ–ఎన్నఁడును లేదు. ప్రశ్నకు నుత్తరమునకు సందేయుండఁగూడదు. నాపని నాది; వారిపని వారిది. ఎవ్వరిపనివారు చూచుకొని భోజనము చేయవలసినదే.

మా స్టేషనులోఁ గొన్ని నాళ్లుపగలు మూఁడు,రాత్రి రెండుబండ్లు, రాకపోకలు, పదిసారులు. ఉదయమున రెండు కొన్ని నాళ్లు,సాయంకాలము మూఁడుకొన్ని నాళ్లు; మధ్యాహ్నము మిడసరిలగ్నములోఁ గొన్ని దినములు. నగరము సమీపమగుటచే–మఱికొన్ని క్రొత్తవి. గవర్నరులు, గవర్నరు జెనరలు మొదలగువారివి, మహారాజులవి స్పెషల్ బండ్లుకొన్ని – కాని, అన్నియు మా స్టేషనులో నిలువవు. అదికొంత తేలిక. రాత్రిబండ్లకుఁ బండుకొన్న మావారిని గోపీకుచమర్దనుఁడో,మఱియెవ్వరో వచ్చి పిల్చువారు. మేమే వారు వచ్చునప్పటికి గడియారములో అలారము పెట్టుకొని సిద్ధముగా నుండువారము. కొన్ని మాలో మాకు గుర్తులు. తూర్పుబండి వెళ్లగానే మడి కట్టుకొనవలయును. అయిదవబండి పడమటికిఁబోయిన తర్వాత భోజనముకావలయును. ఇట్లని గడియారము చూడకుండఁగనే వచ్చిపోయెడు బండ్లగంటలనుబట్టియే మాకు గంటలు తెలియుచుండును. స్నానమునకు నీళ్లు, పీఁట, మడిపంచె, యంగవస్త్రము, పంచపాత్ర–యుద్ధరిణి వారిరాక కెదురుచూచుచుండునవి. ఒక్కపని వారికిఁ జెప్పుటలేదు. అరుగుమీఁది చెంబుతో ముంచి పోసికొనుఁడనలేదు. ఇక్కడి పుల్లయక్కడఁ బెట్టుటకు వారి కవసరము లేదు. నేనింట నున్నన్ని దినములలో నూతిలో బొక్కెన వేయనీయను. కన్నుసంజ్ఞలో నన్నియు సన్నిధిని బెట్టుటయే. నేను జిన్నదానను; తల్లిదండ్రులు దాపున లేరు, అని–వారుమాత్రము? నాకంటె నేమి పెద్ద? వారితల్లిదండ్రులు నొద్దలేరు–మేమిద్దఱము సమానస్కంధమున నున్నారము. కావున నొకరివలన నొకరికి బాధ కలుగదు. ఒక్కరుగాదని యొక్కరు, భేదభావము, రహస్యములు, ఆలోచనములు నుండరాదని యిరువురము నెవ్వరిమట్టుకు వారే తలంచుట–మనస్సు, వాక్కు, కాయము నొక్కరీతిగా నుండవలసినదేయని– పెండ్లిలోఁ జెప్పు "ధర్మేచ, అర్థేచ, కామేచ, నాభిచరితవ్యా, నాభిచరామి" అనునవి చిలుకపలుకులవలె మేమెప్పటికిని

గార్హ్యరూపమునఁ బఠించుచునే యున్నారము. చిన్నతనములో నేర్చికొనినవి కాలానుగుణముగా వినియోగించుటయే ప్రధానధర్మము.

ఇద్దఱము నొక్కచోటే రెండువిస్తళ్లు వేసికొనువారము. చెప్పవద్దామటే-భోజనముచేసి వారులేచి వెళ్లిన తర్వాత నాకొక్కతెకుఁ దోఁపదని నిర్బంధముచేసినన్నుఁ గూడఁ బగలు తమతో భోజనముచేయుమనువారు. ఇష్టగోష్ఠితో భోజనము చేయువారము. తమ కెక్కువయని పచ్చడియో, కూరయో నావిస్తరిలో వేయువారు. నాకుఁ గావలసినంత నేనును వైచికొనుదానను. వెనుకటి కొక యిల్లాలు కందిపప్పు పచ్చడిచేసియంతయు నొక్కచోటే పెనిమిటి విస్తరిలో, 'నాభాగమునాకట్టే పెట్టరా' యని, పెట్టివైచునదట. దానికి దాఁచుకొనకుండ నంతయు నాకువేయదని యావెఱ్ఱిబ్రాహ్మణుఁడు పచ్చడియంతయు దినువాఁడట. అట్లుకాకుండ నిద్దఱకు వేర్వేఱవైచికొని, రాత్రికి వేఱొకటి చేసికొనవలయునని తలంపున్న-దానిని తినినంత తిని రుచ్యమైనదైన మేము మిక్కిలి నియమపరులముగాము గనుక రాత్రికి నిలువచేసికొని-పోర్టరు కుఱ్ఱవాని నెవ్వనినో పిలిచి - మీయమ్మకిమ్మని పెట్టుదానను. ఇట్లుగా నొక్కసంవత్సరముపైఁగా ఆగరపారాలో నున్నారము. వారు లేచి చేయికడిగికొని మడిబట్టవదలి దుస్తులువేసికొనునప్పటికి నేను విస్తళ్లుపాఱవైచి యెంగిళ్లెత్తి వంటయిల్లు చక్కఁబెట్టి యీవలకు వచ్చుదానను. వారు వెళ్లినతర్వాత, వీథితలుపు గొళ్లెముపెట్టి కిటికీలోనుండి రైలుస్టేషను వంకఁజూచుచుఁ గొంతసేపు చదువు, తల దువ్వికొనుట, రవికలు కుట్టుకొనుట, ఏదో కొంతసేపు, తోఁచకవచ్చిన యిరుగుపొరుగు స్త్రీలతో సంజ్ఞలు, సగముసగము మాటలు-వినోదము. ఈ పూఁట కాపూఁట భోజనము చేయుటయేకాని, చిఱుతిండ్లు, కాఫీలు, టీలు, మేమెఱుఁగము. "భుక్త్వా శతపదంగత్వా తాంబూలం తదనంతర"మన్నది శాస్త్రములోని మాటయేగాని-మాకుఁ దాంబూల మలవాటు లేదు. దేశాచారముచొప్పున మనదేశములోఁ జుట్టముక్కయడిగినట్లు-మమ్మెవ్వరైన నడుగుచుండురని కొన్నియాకులు నిలువయుంచువారము. ఏదో దైవికముగాఁ దలనొప్పియో, కడుపునొప్పియో వచ్చిన, మహారాజు మనదేశములో గోపాలాచార్యులువలె, నిక్కడ మాకు దేవేంద్రనాథసేనుగా రుండచేయుచున్నారు. కాకిచేఁ గబురుపంపిన నింత మందు పంపువారు. తిట్టినట్టుగ నుద్దినట్లు మాత్రమింగుట లోనికిఁ బోవుటయేతడవు; హాయిగానుండువారము. నేనెంజాలదినములు, డాక్టరనిన, వైద్యుఁడనిన గోపాలాచార్యులుగారనిన నొక్కటే యర్థమనుకొనుదానను. ఆయలవాటుచొప్పున-సేనుగారనుటకు మొదలు - గోపాలాచార్యులుగా రనుట వాడుక. మాబంధువుల పిల్లగాని కొక్కనికి వానినాయనమ్మ తొన్నరాత్రిచేసికొను రొట్టెముక్క ప్రొద్దుననే పెట్టుట యలవాటు చేసినది. ఆపిల్లవాఁడొక చుట్టములయూరు తల్లితో వెళ్లినాఁడు. రొట్టెముక్క దొరకలేదు. అమ్మా, యీయూరిలో నొక్కరికి నాయనమ్మలేదా యన్నాఁడట-అట్లే నాకీయూరిలో గోపాలాచార్యులుగారు లేరాయని యనుదానను. మాయూరిలో నున్నపుడన్నియు వారిమందులే-పెద్దగడ్డము బొమ్మ, పట్టివర్థనములు.

ఇట్టు చప్పిదముగా వాడుకొనుచున్నను మాపాటు 'గాజులబేరము భోజనమునకు సరి'యనునట్లుండెను. ఏ నెలకా నెల తండ్రిగారికిఁ గొంతపంపుటకుఁ, బాపము! జీతము తెచ్చి బల్లమీఁదఁబోసి నావంకఁ జూచువారు. 'ఉన్నదానిలోనే సరదుకొనవచ్చును. వారికిఁ బంపుఁడు, తలఁచుకొన్నది పంపి మిగిలినదే మనము వాడుకొందము'అని ధైర్యముచెప్పి లోనికిఁబోయి యన్నియుఁ జూచుకొని 'పదినాళ్లకు బియ్యమున్నవి; పదేనునాళ్లవఱకుఁ బప్పులున్నవి; బొగ్గులున్నవి; గడచిపోవును. మామగారికిఁ బంపవచ్చు'నని దృఢముగాఁ జెప్పినంతటఁ బంపుచుండువారు. ఇట్టి యవస్థలో మాకిక్కడనుండి వెనుక మేమావును దూడను బెట్టుకొన్నాము. తర్వాత కలకత్తాకు బదలాయించినారని చెప్పితినే యాస్టేషనుకు మార్చినారు. కొంతజీతము హెచ్చుదొరకినది. 'నారుపోసినవాఁడు నీరుపోయఁడా. తల్లిదండ్రులైనను జిన్నప్పుడు పట్టెఁడే యన్నము తినియెనని యెల్లకాలముఁ బట్టెఁడే పెట్టెదరా' అని సంతోషముతో యజమానులను దీవించువారము. "అన్నదాతా సుఖీభవ"యని భోజనముచేసి లేచునపుడెల్ల మావారు పలుకువారు. స్వామిభక్తి యామాత్రము లేకున్నఁ దినినయన్న మేమగునో? స్థాతలంపు

దినమునకు నూఱుసారులైనను బోషించువారిని స్మరింప వలసినదనియే. ఆయన యుత్తరాపోశన మెత్తినపుడెల్ల రైలుకంపెనీవారిని దలఁచుకొని నాయెడలుగగుర్పొడుచుచుండెను. తీఁగదండావళి, రైలుకంపెనీవారితో పాటు, మాయోవరుసీరుగారివఱకు నందఱు నొక్కరివెనుక నొక్కరు జ్ఞాపకము వచ్చుచుండిరి. మా కుపకారములుచేసిన సజ్జనులు జ్ఞప్తికివచ్చి యానందబాష్పములు జిలజిలరాలు గననదియతిశయోక్తికాదు. వీరందఱితోఁగూడఁ బెట్టిన యన్నము పడఁద్రోయలేదు గనుక మురళీధరుగారును స్మరణీయులే.

ఈక్రొత్తక్షేమను సమాచారములన్నియు మీకిదివఱకే చెప్పియున్నదానను. కొన్నివిశేషములుగలవు చెప్పవలసినవి. ఎవ్వరు విదేశస్థులమని, మామీఁదదాడివెడలిరో యెవ్వరు మాపై సవతితల్లిప్రేమ కనఁబఱిచిరో, యెవ్వరి యాకాశరామన్న యుత్తరము మొదలగునవి మా-సుగుణరత్నములకు సానరాళ్లయినవో యామురళీధరుఁడుగారే మాకంటెఁ గొన్నినెలలుముందుగా నీక్షేమనులోఁ జిన్నమేష్టరుగా నియమింపఁబడినారు. మేమిక్కడకువచ్చుచున్నామనునపుడు, పాప, మాయనపరితాపము- తోటివాఁడు కవీశ్వరునివలె వర్ణించినాఁడు. కొందఱకుఁ గొన్నినాళ్లకుఁ దమయనుభవమునుబట్టియో బుద్ధిమాంద్యమునను వచ్చును. వేఱుపాయముతోఁ పక పూర్వచరిత్రము నొకస్వప్నముగా భావించుకొని-వాద్యము వరుసదప్పినదని-తనకుఁ బైవారముగా వచ్చుచుండుటచేత గతము మామనస్సులో నేమైననుండి యేమిహాని చేయుదుమోయని-యడఁకువగనే సంచరించినాఁడు. ఒకరు మన కపకారముచేసిన మనమువారి కుపకారము చేయవలయునుగాని యపకారము కలనైనఁ దలఁపరాదుగదా! అట్లేచేసిన సామ్యము చెప్పినట్లుండును. మామనస్సులో నింకను, దానుదలపెట్టనది, చేసినదికాదు - అపకృతియున్నదనుకొనుచుఁ గొంతకాలము ప్రక్కబెదరుగా మసలినాఁడు. కానియది మాహృదయములలోనుండి యాగతపారాలోనే విడువడిపోయినది. ఇక్కడవీనినిజూడఁగనే పూర్వపరిచయమేకాని యపకృతి మాకుఁ దలంపునఁబొడ లేదు. మావలన క్షేమనులోనివారికిని బాటసారులకును,వర్తకులకును గలిగినసౌకర్యములు తొలుతనే చెప్పియుంటిని. దానికినిదర్శనము మేము కలకత్తాకుఁబోవునపుడు వారు చూపినయాదరమును గృతజ్ఞతయును విదిత పఱిచియే యుంటిని.

'ఉపకారికి నుపకారము, విపరీతముగాదుసేయ' అపకారి కుపకారముచేయుటలో నెపముండఁగూడదు. మాకతనివలననపకారము జరుగనేలేదు. ఆపునుమాకిమ్మట, మేముదానితో వినోదించుట-మరల నాతనికే యొప్పఁజెప్పుట - ఉపకారమే. కృతజ్ఞత యెల్లకాలము నుండవలయును.

---

## ఆంధ్రుడా!

మల్లవి లక్ష్మీనరసింహదాసు, సూరపనేని రామగోపాలరావు గార్లు

౧

ప్రాచీన ఆంధ్రదేశము

ఆంధ్రజననీ కంఠలంబిత
హారరోచులు ప్రిదిలెనిచ్చట
యిట్టి పురాతన నృపయశస్సులు
న్నురుగు గట్టినవి.

పాడువడు ఖిల్లాల పుట్టువు
పాడుకొనుచును తూర్పుకనుమలు
మ్రోడు చిగురుచు పచ్చదనమున
గగురు పొడిచినవి.

రాతిరింబవలొక్కరీతిని
గౌతమీ కృష్ణా స్రవంతులు

౦